క్లుప్తంగా

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

డీఎల్‌ఎంటీ ఇమాన్యుల్



మాట్లాడుతున్న ఇమాన్యుల్

కొందుర్గు: ఓటరు జాబితా పారదర్శకంగా ఉండేలా బీఎల్‌ఓలు చర్యలు తీసుకోవాలని డీఎల్ ఎంటీ ఇమాన్యుల్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌ఓల అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చూడాలన్నారు. అదేవిధంగా ఓటరు మరణించిన అనంతరం జాబితాలో అలాగే పేర్లు కొనసాగడం సరికాదని, వారిని గుర్తించి తొలగించేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితా తప్పులు లేకుండా పారదర్శకంగా ఉండేలా చూసే బాధ్యత బీఎల్‌ఓలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్, అధికారులు నరేందర్, బాలవర్ధన్ పాల్గొన్నారు.

నేడు బీఎల్‌ఓలకు అవగాహన సమావేశం

కేశంపేట: మండలంలో వివిధ గ్రామాల్లో బీఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్న వారికి మండల పరిధిలోని కొత్తపేట రైతు వేదికలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అజాంఅలీ తెలిపారు. ఈ కార్యక్రమానికి డీఎల్‌ఎంటీ ఇమాన్యుల్, ఆర్డీఓ కార్యాలయంలో ఎలక్షన్ విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఐ బాలవర్ధన్‌లు బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు బీఎల్‌ఓలు సకాలంలో రావాలని ఆయన కోరారు.

భగీరథ నీరు కలుషితం



కొందుర్గులో కలుషితమైన భగీరథ నీరు

కొందుర్గు: ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నారు. కానీ మండల కేంద్రంలో గత కొన్నాళ్లుగా భగీరథ నీరు పచ్చగా వస్తున్నాయని, తాగడానికి ఏమాత్రం పనికి రాకుండా పోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సురేఖను వివరణ కోరగా.. భగీరథ నీరు మొదటగా పచ్చగా వచ్చినప్పటికీ కొద్ది నిముషాల అనంతరం బాగానే వస్తున్నాయని తెలిపారు. ఈ కలుషిత నీరు ఎలా తాగాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నియామకం



నియామకపత్రం అందుకున్న నూతన సభ్యులు

కేశంపేట: రాష్ట్ర మేదరి సంఘంలో అనుబంధంగా ఉన్న ఉద్యోగుల విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన ప్యారసాని రాములు ఎంపికయ్యారు. సోమవారం వరంగల్‌లో నిర్వహించిన మేదరి సభలో ఆయనను ఎంపిక చేశారు. అదేవిధంగా రాష్ట్ర యువజన సంఘం సహాయ కోశాధికారిగా అదే గ్రామానికి చెందిన పులి కుమార్‌ను ఎంపికచేసి.. ఇరువురికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రామకాంత్, రాజశేఖర్, ఉమ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు వాణిజ్య దుకాణాల వేలం

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఫేజ్-1లోని వాణిజ్య దుకాణాలను ఈ నెల 9న వేలం వేయనున్నట్లు వెల్ఫేర్ అసోసియేషన్ సోమవారం ప్రకటించింది. మొత్తం 42 దుకాణాలకు గాను వేలం పాట నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు అసోసియేషన్ సభ్యులను సంప్రదించాలని సూచించారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి అనురాధ

మొయినాబాద్: రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ సూచించారు. దేశంలోని రైతులందరికీ 11 అంకెల యూనిక్ కోడ్ కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, కేంద్ర పథకాలు పొందడానికి ఇది అవసరమన్నారు. మండలంలోని రైతులందరూ మొయినాబాద్ రైతువేదిక, కేతిరెడ్డిపల్లి రైతువేదికలో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



విద్యార్థులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు, పాఠశాల సిబ్బంది

కొందుర్గు: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులతో మంచి భవిష్యత్ పొందాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం మండలంలోని పుల్సుమామిడి గ్రామ పంచాయతీ పరిధిలో గల కేజీబీవీలో అదనపు భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విద్యాసంవత్సరం ఉత్తమ ర్యాంకులు సాధించిన 10 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే రూ.5వేల చొప్పున రూ.50వేల నగదు పురస్కారం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత రంగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కొందుర్గు ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.150కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థాపించడం అభినందనీయమన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పాఠశాలకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో కేజీబీవీకి దాతలు భారీ ఎత్తున విరాళాలు ప్రకటించారు. గుంజల్‌పహాడ్‌కు చెందిన కృష్ణ పాఠశాల ఆవరణలో పేరెంట్స్ కోసం షెడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి వాష్ ఏరియాలో షెడ్ నిర్మిస్తామని హామీనిచ్చారు. వీరేషం గ్రంథాలయం ర్యాక్‌లు, కృష్ణారెడ్డి ఇన్‌వర్టర్ అమర్చుతామని హామీనిచ్చారు. పర్వతాపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యురాలుమంజులమల్లేశ్‌గౌడ్ రూ.లక్ష చెక్కు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి రూ.లక్ష, అదేవిధంగా మంగులాల్‌నాయక్ రూ.లక్ష, గోపాల్‌రెడ్డి రూ.5లక్షలు, మహిపాల్‌రెడ్డి రూ.20వేలు ప్రకటించారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, నరేందర్, రవీందర్, అంజిరెడ్డి, జహంగీర్, నర్సింలు, గోవర్ధన్‌గౌడ్, మానయ్య, మహేందర్ పాల్గొన్నారు.

డిప్యూటేషన్ పంపిస్తే సహించేది లేదు

ఉపాధ్యాయులు రాజకీయం చేస్తూ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మారుమూల మండలాల నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై వెళ్తున్నారని, ఇలా వెళ్తే సహించేది లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ గాయత్రితో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం న్యాయబద్ధంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తిచేసిందని, ఉపాధ్యాయులు తమ అనుకూలం కోసం దొడ్డిదారిన డిప్యూటేషన్‌పై వెళ్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ఒకవేళ ఇలా ఎవరైనా వెళ్తే చర్యలు తప్పవన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి



మాట్లాడుతున్న కిసాన్ సంఘ్ నాయకులు

షాబాద్: విద్యుత్ అధికారులు సమస్యలు పరిష్కరించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విద్యుత్ అవసరాన్ని ఆసరా చేసుకొని సమస్యలు పరిష్కరించకుండా విద్యుత్ అధికారులు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పంటల సాగుకు రైతుకు విద్యుత్ అవసరాన్ని ఆసరా చేసుకున్న అధికారులు డబ్బులకు ఆశపడి సకాలంలో సమస్య పరిష్కరించకుండా.. ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. బొబ్బిలిగామలో గత వారం రోజుల నుంచి రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడంలేదని ఏఈకి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. చాలా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఏర్పడితే విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు స్వయంగా రిపేర్ చేసుకోవాల్సి వస్తోందన్నారు. విద్యుత్ అధికారులకు డబ్బులు ఇస్తే తప్పా పని చేయడంలేదన్నారు. ఇలా అక్రమాలకు పాల్పడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యుత్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కృష్ణ, సత్యంగౌడ్, మల్లేశ్, రైతులు తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించాలి



తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: స్థానిక సంస్థలలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేలా అసెంబ్లీలో చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌లను వెంటనే విడుదల చేయాలని, దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని కోరారు. చేయూత పెన్షన్ కోసం రాష్ట్రంలో 24.85లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్, మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేటివ్ చట్టాలకు సవరణ చేసి స్థానిక గ్రామ పంచాయతీ, మండల జిల్లా పరిషత్, మున్సిపాలిటీలలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. పలు రాష్ట్రాల్లో చట్టం చేసి అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణాలో కూడా అమలు చేయాలని కోరారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు నాగేశ్, సభ్యుడు రాంరెడ్డి ఉన్నారు.

చెర్లగూడ బ్రిడ్జిని పూర్తిచేయాలని వినతి



ఏఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

చేవెళ్ల: అసంపూర్తిగా ఉన్న మండలంలోని చెర్లగూడ గ్రామ బ్రిడ్జిని త్వరగా నిర్మించి ప్రజల సమస్యలను తీర్చాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు కోరారు. సోమవారం ఆయన ఆర్డీఓ కార్యాలయంలో బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి దాదాపు మూడు సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటివరకు పూర్తికాలేదన్నారు. 30శాతం పనులు మాత్రమే చేశారని వివరించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరుతాయని భావిస్తే ఆశలు అడియాలుగానే మిగిలిపోతున్నాయని వాపోయారు. ఈ వాగుపై బ్రిడ్జి లేకపోవటంతో గతంలో గ్రామస్తులు వాగులో పడి మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఈ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మల్కాపురం సత్యనారాయణ, మహేశ్‌లు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఎలుగంటి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో జరుగుతున్న ఏఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో గత 10 రోజులుగా ఎస్‌పీఎల్-3లో క్రికెట్ టోర్నమెంట్‌లో ముంబై వర్సస్ గుజరాత్ టీమ్స్ మధ్య హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ఎస్ఆర్ హెచ్ ప్లేయర్ కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడాపాలసీ ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామస్థాయి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో యువత ప్రతిభ కనబర్చాలని సూచించారు. క్రీడాపోటీల నిర్వహణతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పాడుతాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకుసాగాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు రాహుల్‌గుప్తా, గౌరీశ్వర్, శ్రీనివాస్, రఫిక్, మహేశ్, గౌతమ్, దయాకర్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

శంకర్‌పల్లి: రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో పాటు స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్లను సైతం బదిలీ చేయాలన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు సైతం 20 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని, 317 జీఓతో ఎంతో మంది ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించి, సత్వరమే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

ఉద్యోగులకు విరమణ సహజం

షాబాద్: ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని హైతాబాద్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం వసంత, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుల్ల సత్తయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన హెచ్ఎం మిట్ట రవీందర్ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్, రాజేశ్వరీ దంపతులను పాఠశాల సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేష్, అంగన్‌వాడీ టీచర్ సావిత్రి, గ్రామస్తులు రవీందర్‌గౌడ్, రమేశ్‌గౌడ్, మహేందర్, నర్సింలు, మహిపాల్, రాజు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ కిష్టయ్య తదితరులు

కేశంపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య సూచించారు. మండల పరిధిలోని కొత్తపేటలో రైతు నర్సింహ పొలంలో టేకు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ.. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహయాదవ్, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, చోడం శ్రీనివాస్, రవి, కృష్ణయ్య, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల పక్షాన నిరంతర పోరాటం



మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మంచాల: ప్రజా పోరాటాలతోనే మార్పు సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో ఆ పార్టీ 10వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజా సమస్యలు ఉన్నన్ని రోజులు ఎర్ర జెండా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ ఏర్పడి నేటికీ వందసంవత్సరాలు గడిచిందని, దేశంలో అనేక ఉద్యమాలు చేసిందని గుర్తుచేశారు. భవిష్యత్‌లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తుందని చెప్పారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి మరో పోరాటం చేయక తప్పదన్నారు. పార్టీ మండల కార్యదర్శి బురుగాల గాలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజ్ రవింద్ర చారి, కావలి నర్సింహ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరిగంటి యాదయ్య, జిల్లా నాయకులు నీలమ్మ, నర్ల శ్రీశైలం యాదవ్, రాజు నాయక్, గాలయ్య, అలీమొద్దీన్, అనంతరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి మైసిగండి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాలులో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతిగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ కార్యకర్తల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతమయ్యేలా చురుగ్గా పనిచేయాలని సూచించారు. వాటి గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, ఇన్‌చార్జీలు రాంచంద్రరెడ్డి, అరవింద్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు దయసాగర్‌రెడ్డి, బాలకోటి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేశ్, అభినవ్‌రెడ్డి, అనిల్‌గౌడ్, షాబుద్దీన్ పాల్గొన్నారు.

బుగ్గయ్యగౌడ్ సేవలు చిరస్మరణీయం

మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత పాలకూర్ల బుగ్గయ్యగౌడ్ మండల అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో బుగ్గయ్యగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబీలకు పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పని చేసిన జంగయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. సింగంపల్లిలో జంగయ్య పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శి, ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట రమణారెడ్డి, జగన్, అనంతరెడ్డి, బాబా, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



షాద్‌నగర్: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు



చేవెళ్ల: మండల కేంద్రంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు సంద శ్రీనివాస్, శ్రీశైలం, శ్రీనివాస్, వెంకటయ్య, యాదయ్య, వెంకటేశ్, సమద్, రమేశ్‌గౌడ్, యాదయ్య, కృష్ణయ్య, చెన్నయ్య, సత్యం, యాదయ్య, నర్సింలు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షుడు కొజ్జెంకి యాదయ్య ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కేశంపేటలో..


కేశంపేట: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిత్ర శ్రీను, నాయకులు గంజాయి దశరథ, కిష్టయ్య, దాసునాయక్, గ్యార సురేష్, మురళీమోహన్, రాంచంద్రయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అలుపెరగని పోరాటం


షాబాద్: ఎస్సీ వర్గీకరణకు మందకృష్ణమాదిగ మూడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేశారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్యమాదిగ, మాజీ అధ్యక్షుడు ముక్కు విశ్వంమాదిగ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజేఎస్ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ(ఆర్కే), ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్, తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొళ్ల ఆంజనేయులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రొద్దటూరులో..


శంకర్‌పల్లి: మండలంలోని ప్రొద్దటూరులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి, ఒకరికొకరూ తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాను, నాయకులు పాల్గొన్నారు.



కేశంపేట: కేక్ కట్ చేస్తున్న నాయకులు



షాబాద్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



శంకర్‌పల్లి: ప్రొద్దటూరులో..